క్లుప్తంగా

బూచేపల్లి ప్రమాణ స్వీకారానికి తరలి రావాలి

దొనకొండ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన 4వ తేదీ అనగా శుక్రవారం ఉదయం 9 గంటలకు పార్టీ అధ్యక్షునిగా ఒంగోలులో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని పార్టీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బూచేపల్లి కుటుంబంపై అభిమానంతో శివప్రసాదరెడ్డిని జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేశారన్నారు. ఆయన పిలుపు మేరకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు, జగన్, బూచేపల్లి అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. శివప్రసాదరెడ్డి అడుగు జాడల్లో మనం అందరం నడుచుకుని ఐక్యతతో ముందుకు సాగి ఎలాంటి విభేదాలు లేకుండా పార్టీకి పని చేసి 2029 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ శివప్రసాదరెడ్డిని ఎమ్మెల్యేగా చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ గుంటు పోలయ్య, మాజీ సర్పంచ్ కర్నాటి ఆంజనేయరెడ్డి, విప్పర్ల చిన్నమల్లయ్య, కాలూరి రమణయ్య, గుమ్మా వెంకటేశ్వర్లు, బుజ్జి, నూనె వెంకటరెడ్డి, ఇండ్ల శ్రీనివాసులు, బాపనపల్లి శ్రీనువాసులు, పాతకోట కోటిరెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

తాళ్లూరు (దర్శి): మోటారు సైకిల్ వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని ఎస్సై మల్లికార్జునరావు సూచించారు. తాళ్లూరులో మోటారు సైకిల్ చెకింగ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఎస్సై మాట్లాడుతూ వాహనాల్లో తమ పత్రాలు పోర్స్‌లో ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని, అలా వాహనాలు పట్టుబడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

లాల్ బహదూర్ శాస్త్రికి ఘన నివాళి

దర్శి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మాజీ ప్రధాని దివంగత లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు బీసీ సంఘాల నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు వెంకటేశ్వర్లు, దళిత సేన నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, బీసీ సంఘ నాయకులు ధరణికోట పిచ్చయ్య, దర్శి ప్రసాద్, శ్రీను, మోషే, ప్రసాద్, వైవీ రెడ్డి, రమేష్, ఏసుదాసు, సంజు పాల్గొన్నారు.


ఉత్సవాలకు ముస్తాబవుతున్న యల్లమ్మదేవి ఆలయం


తాళ్లూరు: నవరాత్రులకు సిద్ధమైన గుంటి గంగాభవానీ అమ్మవారు


పెద్దారవీడు: రాజంపల్లిలో ప్రత్యేక అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు


కురిచేడు: శ్రీజ్ఞానప్రసూనాంబదేవి మూలవిరాట్


ప్రత్యేక పూజలకు సిద్ధం చేసిన అమ్మవారి ఉత్సవమూర్తి

నేటి నుంచి దేవీశరన్నవరాత్రులు

- రోజుకో అలంకారంతో దర్శనం ఇవ్వనున్న జగన్మాత

పుల్లలచెరువు: గ్రామాల్లో దసరా ఉత్సవాల సందడి నెలకొంది. గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. చెడుపై మంచి విజయం సాధించినందుకు సూచికగా జరుపుకునే వేడుకలకు ఊరు వాడ సిద్ధమవుతున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఉత్సవాలను ఇప్పుడు పల్లెల్లోనూ ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలోని దేవాలయాల్లో ఉత్సవ కమిటీలు ఏర్పడి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు చేస్తున్నారు.

ముటుకులలో భారీ ఏర్పాట్లు

ఈ నెల 3 నుంచి ప్రారంభమై 12వ తేదీ వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలను శ్రీ రేణుక యల్లమ్మదేవి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని ఆలయ పూజారి భరద్వాజశాస్త్రి తెలిపారు. అమ్మవారిని రోజూ ప్రత్యేక అలంకరణతో పూజలు చేస్తామన్నారు. ఉత్సవాల సమయంలో రోజూ రాత్రి అన్న సంతర్పణ జరుగుతుందని తెలిపారు. ఆలయ కమిటీ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది.

శరన్నవరాత్రులు ఎందుకంటే..?

ఏటా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదట నవమి వరకూ దేవి నవరాత్రులు లేదా శరన్నవరాత్రులుగా వ్యవహరిస్తారు. ఆశ్వయుజ మాసం నుంచి వర్ష రుతువు వెళ్లి శరత్ రుతువు ప్రారంభమవుతుంది. దీంతో శరన్నవరాత్రులుగా పిలుస్తారు. ఈ రుతువులో వర్షాకాలం ముగిసి చలికాలం మొదలవుతుంది. ఆ సమయంలో వాతావరణంలో కలిగే మార్పులు అనేక రోగాలకు కారణమవుతాయి. అందుకే ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి శక్తి ఆరాధన పేరుతో ప్రజలంతా పరిశుభ్రంగా ఉండి ప్రత్యేక పూజలు చేస్తారు. ఎటువంటి రోగాలు కూడా దరిచేరవన్నది నవరాత్ర వేడుకల సారాంశంగా పండితులు చెబుతారు.

దుర్గాదేవి అవతారాలు

3వ తేదీన బాలాత్రిపురసుందరీదేవి. 4వ తేదీన గ్రాయిత్రీదేవి, 5న అన్నపూర్ణదేవి, 6న లలితాత్రిపురసుందరీదేవి, 7న రజిత కవర అలంకృత విజయదుర్గాదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతిదేవి (మూల నక్షత్రం), 10న దుర్గాదేవి, 11 మహిషాసురమర్ధనీదేవి, 12న రాజారాజేశ్వరిదేవి అలంకారాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొ్డ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు భవానీప్రసాద్ బుధవారం తెలిపారు. రోజూ ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలతో పాటు రోజూ ప్రత్యేక అలంకరణలో అలంకరించి పూజలు చేపడతామని చెప్పారు. గురువారం సిద్ధిలక్ష్మి, శుక్రవారం క్షీరసాగరకన్య, శనివారం గజలక్ష్మి, ఉదయం పుష్పయాగం, ఆదివారం ధాన్యలక్ష్మి, సోమవారం మహాలక్ష్మి, మంగళవారం విజయలక్ష్మి, బుధవారం మహా సర్వసతి, గురువారం గాయత్రి, ఉదయం చండీహోమం, శుక్రవారం వేదవతి, శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామి తిరు కళ్యాణోత్సవం, శనివారం అశ్వ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. రోజుకొక అంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తులు నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించి తరించాలని విజ్ఞప్తి చేశారు.

కురిచేడు: దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కానుండటంతో ఆలయాలు ముస్తాబవుతున్నాయి. స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లను, అమ్మవారికి చేసే అలంకారాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ పూజారులు కురిచేటి సుబ్బారావు, నారాయణం వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్టమూరి నాగేశ్వరరావు, కొత్త వెంకట అయ్యప్పశెట్టిలతో చేయిస్తున్నారు.


ముటుకుల ఆలయంలో వేంచేసి ఉన్నత యల్లమ్మదేవి

> **అమ్మ అనుగ్రహం కోసం**
>
> అమ్మవారి కృపాకటాక్షాలు ఉంటే సకల శుభాలు కలుగుతాయి. నవరాత్రుల్లో అమ్మవారిని కొలవడం ద్వారా అష్ట ఐశ్వరాలు సిద్ధిస్తాయి. పాడి పంటలు, పసుపు కుంకాలు, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండేందుకు అమ్మవారిని రోజు కొక రూపంతో కొలవడం భక్తుల విశ్వాసానికి ప్రతీక.
>
> – ఎస్.భరద్వాజ శాస్త్రి, పురోహితుడు, ముటుకుల

దర్శి: విజయదశమి పండగను పురస్కరించుకుని దర్శి నియోజకవర్గంలో దేవీ నవరాత్రుల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, శ్రీ దద్దాలమ్మ అమ్మవారి ఆలయం, శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయం, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో, తాళ్లూరు మండలం ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయం, గంగవరం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, తాళ్లూరు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, ముండ్లమూరు మండలం మారెళ్ల భ్రమరాంభ సమేత అమ్మవారి సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో దేవీ నవరాత్రులు జరిపేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు పూజారులు సిద్ధం చేశారు. తొమ్మిది రోజులు శ్రీ బాలత్రిపుర సుందరీదేవి, శ్రీ వేదమాత గాయత్రీ దేవి, శ్రీ అన్నపూర్ణాదేవి, శ్రీ లలితా పరమేశ్వరీ దేవి, శ్రీ శాకంబరి దేవి, శ్రీ మహాలక్ష్మీ దేవి, శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి, శ్రీ దుర్గాదేవి, శ్రీ మహిషాసురమర్ధిని దేవి, శ్రీ రాజరాజేశ్వరి దేవి అవతారాల్లో ఇలా ఆయా ఆలయాల్లో కేటాయించిన రోజు కేటాయించిన విధంగా అమ్మవారిని తొమ్మిది శక్తి అవతారాల్లో అమ్మవార్లను అందంగా అలంకరించి అమ్మవారి దర్శనం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. పదో రోజు విజయ దశమి రోజు అమ్మవారు నిజరూప దర్శనంలో భక్తులకు దర్శనం ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఆలయాలకు లైటింగ్‌లు ఏర్పాటు చేసి రంగులు వేసి అందంగా అలంకరించారు. పలు ప్రాంతాల్లో అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గాంధీ గ్రామ స్వరాజ్యం జగనన్నకే సాధ్యం


దర్శి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాల పంపిణీ


తాళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్సై మల్లికార్జునరావు


ముండ్లమూరు పోలీస్‌స్టేషన్‌లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఎస్సై నాగరాజు


వైపాలెం: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు


దొనకొండ: గాంధీకి పూలమాల వేస్తున్న అంజయ్య, కృపారావు

దర్శి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగనన్నకే సాధ్యమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. దర్శి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానకి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనలో గాంధీజీ దేశానికి చేసిన సేవలు గుర్తు చేశారు. గాంధీజీ తీసుకొచ్చిన అహింస, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. గాంధీ మార్గంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనించారన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం దిశగా అప్పటి ప్రభుత్వం అడుగులు వేసిందన్నారు. ఇంటింటికీ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు చేరువ చేసినట్లు పేర్కొన్నారు. శాంతి, అహింసకు పెద్ద పీట వేసిన వ్యక్తి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీ మార్గంలోనే నడవాలని, శాంతి, సమానత్వానికి పాటు పడాలన్నారు. అనంతరం అందరికీ అన్నదానం చేశారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, యూత్ జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ సుధాఅచ్చయ్య, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, దొనకొండ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, మారం ఇంద్రసేనారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నెడ్‌కాప్ మాజీ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, ఇత్తడి దేవదానం, సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, నాయకులు మజ్జువలి, గొంది అప్పిరెడ్డి, ఉడుముల వెంకటరెడ్డి, గోను వెంగళరెడ్డి, కొడవటి జాన్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం.. అని ఎంపీడీవో వసంతరావునాయక్, ఎస్‌ఐ సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని స్థానిక గాంధీ కళాక్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో వసంతరావునాయక్, ఎస్‌ఐ సంపత్‌కుమార్‌లు పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గాంధీ కలలు సాకారం చేయాలని, గాంధీజీ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, సత్యాగ్రహం అనే ఆయుధంతో అఖండ భారతవనికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించి పెట్టారన్నారు. సర్పంచ్ ఓబులు, హెచ్‌ఎం బయ్యన్న, ఎంపీటీసీ రాధాకృష్ణ, గ్రామ పెద్దలు రఘు, జి.భాస్కరరావు, రిటైర్ ఆర్మీ ఉద్యోగి బుజ్జి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గోపి, చిన్నా, కుమార్, గురునాధం, మాజీ ఎంపీటీసీ ఇదెమ్మ, ఎ.వెంకటేశ్వర్లు, లక్ష్మణ, ఎల్లయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.


ఆర్యవైశ్య ప్రముఖులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దొనకొండ: మండలంలో గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కోలా కృపారావు, ప్రభు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు, దివ్యాంగుల అధ్యక్షుడు బచ్చలకూరి కాశయ్య, ఉపాధ్యాయ సంఘం, స్థానిక చిరువ్యాపారులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించి బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి స్వాతంత్ర్య సాధనలో జాతిపితగా మన్ననలు పొంది మతోన్మాద శక్తుల చేతిలో ప్రాణాలు కోల్పోయారని కొనియాడారు. స్వీట్లు పంపిణీ చేశారు. సీపీఎం నాయకులు కుందుర్తి అనిల్, బాలరాజు, సంతోష్, ఫ్రాన్సిస్, కిరణ్‌కుమార్, సుధాకర్, మరియదాసు పాల్గొన్నారు.

బాదాపురం అంగన్‌వాడీ కేంద్రాలో..

బాదాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎల్ నర్సమ్మ, బి.కుమారి, బాలింతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

యర్రగొండపాలెం: మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఉన్న మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమల మాలవేశారు. ఆర్యవైశ్య సంఘం, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, ఏఎంసీ డైరెక్టర్ కందుల సత్యనారాయణ చౌదరి, సర్పంచ్ ఆర్.అరుణబాయి, ఎస్.వెంకటరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, సూరె శ్రీనివాసులు, పబ్బిశెట్టి శ్రీనివాస్, రోషిరెడ్డి, కోటిరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, కందుల నాగార్జునరెడ్డి, బి.బాలచెన్నయ్య, షేక్ మౌలాలీ, రాములు నాయక్ పాల్గొన్నారు.


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. దర్శి మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దర్శి ఎల్‌ఐసీ కార్యాలయంలో లియాఫీ 60వ ఆవిర్భావ దినోత్సవం, గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు స్ట్రీట్‌లోని గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు.

తాళ్లూరు మండలంలో..

పోలీస్‌స్టేషన్‌లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విఠలాపురంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ముండ్లమూరు పోలీస్‌స్టేషన్‌లో గాంధీ జయంతి నిర్వహించారు.

పెద్దదోర్నాల: మండల వ్యాప్తంగా జాతిపిత గాంధీజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్‌లోని జాతిపిత విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా రమణారెడ్డి, సర్పంచ్ చిత్తూరి హారిక, బీసీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, ఒంటేరు నాగేశ్వరరావు, లాలూ నాయక్, రావిక్రింది సుబ్బారావు, మాండ్ల వెంకటేశ్వర్లు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొని జాతిపితకు నివాళులర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి మోహనరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని సర్పంచ్ చిత్తూరి హారిక పాల్గొని గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద మహాత్ముని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కురిచేడు: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు సెంటరులోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తవెంకట అయ్యప్పశెట్టి మాట్లాడుతూ గాంధీజీ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాల గురించి వివరించారు. ఆయన బాటలో నడచి గ్రామస్వరాజ్యం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, కొలిశెట్టి కాశీవిశ్వేశ్వరరావు, చిన్న ఆంజనేయులు, కేవీ పురుషోత్తమరావు, ఎస్‌వీఎల్ సుబ్బారావు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతులను బుధవారం ఘనంగా నిర్వహించారు. త్రిపురాంతకం ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐ జి.అసాన్, ఎస్‌ఐ శివ బసవరాజులు చిత్రపటాలకు పూలమాలలు వేయగా పోలీస్ సిబ్బంది నివాళులర్పించారు. వాసవి అమ్మవారి ఆలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


దొనకొండ: మహాత్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు


పుల్లలచెరువులో గాంధీకి నివాళులర్పిస్తున్న అధికారులు


కురిచేడు: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు


త్రిపురాంతకం పోలీస్‌స్టేషన్‌లో నివాళులర్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

వైఎస్సార్ సీపీ నాయకులకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


తిరుపతిరెడ్డిని పరామర్శిస్తున్న బూచేపల్లి

దర్శి: మండలంలోని దేవవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తిరుపతిరెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. అస్వస్థతలకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ప్రముఖ హోమియో వైద్యులు, మాజీ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్‌ఎం బాషా, మాజీ ఎంపీటీసీ పోశం మధుసూదన్‌రెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీకి కూడా..

తాళ్లూరు (దర్శి): వైస్ ఎంపీపీ యడమకంటి వెంకటేశ్వరరెడ్డి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్య కారణాలు అడిగి తెలసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల కన్వీనర్ తూము వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, దొనకొండ మాజీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఉన్నారు.


వెంకటేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

ఉపాధి పనులపై ఆర్థిక ప్రణాళికలు సిద్ధం చేయాలి

పెద్దారవీడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025–26 సంవత్సరానికి అవసరమైన ఆర్థిక ప్రణాళికలు సిద్ధం చేయాలని మార్కాపురం ఏపీడీ నిర్మలాదేవి అన్నారు. మండల పరిధిలోని బద్వీడుచెర్లోపల్లి గ్రామం సచివాలయంలో సర్పంచ్ ఆకుమళ్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఉపాధి హామీ పనుల గుర్తింపుపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీడీ మాట్లాడుతూ గ్రామ సభల్లో తీసుకునే పనుల నిర్ణయం ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. పనులు గుర్తించే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయానికి, పండ్ల తోటల పెంపకం, గ్రామాల అభివృద్ధి కోసం, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించడమే లక్ష్యంగా గ్రామాల్లో పనులు గుర్తించాలని తెలిపారు. మండల పరిధిలో గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై గ్రామసభలను కచ్చితంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఏపీఓ మంత్రునాయక్, పంచాయతీ కార్యదర్శి బాలకోటయ్య, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో వాహనాల తనిఖీ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్‌లో బుధవారం రాత్రి పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ వాహనాల తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా తిరుగుతున్న వాహనాలను తనిఖీ నిర్వహించి అనుమతి పత్రాలు లేని పలు వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపటంతో అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధిక శాతం రోడ్డు ప్రమాదాలు వ్యక్తిగత తప్పిదాల వల్ల జరుగుతున్నాయని, దీని వల్ల ఏ తప్పూ చేయని ఎదుటి వ్యక్తులు ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. అతివేగం, నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగి ఎన్నో కుటుంబాల్లో విషాదాలు నెలకొంటున్నాయన్నారు. ప్రైవేట్ వాహనదారులందరూ తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, యజమానులు డ్రైవర్ల లైసెన్స్‌లు పరిశీలించి వారికి వాహనాలు ఇవ్వాలని కోరారు. సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపటం నేరమన్నారు. అతివేగం అనర్థదాయకమన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కురిచేడు: వినుకొండ రోడ్డులోని మద్యం దుకాణం సమీపంలో ఓ కూల్‌డ్రింక్ షాపులో మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై శివ తన సిబ్బందితో వెళ్లి షాపును తనిఖీ చేశారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా మద్యం విక్రయాలు నిషేధం అయినా బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తుండటంతో పట్టుకున్నట్లు ఎస్సై శివ తెలిపారు. ఆ షాపులో 8 క్వార్టర్ బాటిళ్లు లభ్యమైనట్లు చెప్పారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన జాతిపిత గాంధీజీ జయంతి రోజు మద్యం, మాంసం విక్రయాలను ప్రభుత్వం నిషేధించింది. అయినా ఆ నిషేధాన్ని అతిక్రమించి మద్యం విక్రయాలు జరగటం జాతిపితకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని సీనియర్ సిటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

20 మద్యం బాటిళ్లు..

తాళ్లూరు (దర్శి): తాళ్లూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ బెల్ట్ షాపుపై దాడి చేసి 20 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మల్లికార్జున్‌రావు తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండచిలువ హల్‌చల్

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లెలో బుధవారం రాత్రి కొండచిలువ హల్‌చల్ చేసింది. గ్రామంలోని బొడ్డురాయి వీదిలో వర్షం కురుస్తున్న సమయంలో రోడ్డు దాటుతూ గ్రామస్తుల కంటపడింది. వెంటనే గ్రామంలోని పాములు పట్టే వ్యక్తిని పిలిపించి కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలేయించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.


కొండచిలువ